
# గొర్రె చచ్చింది


జి. ఉమామహేశ్వర్

'గొర్రె చచ్చింది', స్టాఫ్ రూంలోకి అడుగుపెడుతూ అన్నాడు రంగనాథం.
రంగనాథం హిందీపంతులు. చిన్నప్పటి ఆకతాయి పనుల చిహ్నాలు ఈరోజుకీ కొన్ని నిలువుకున్న వ్యక్తి. నవ్వినపుడు అగుపడే గారపళ్ళు వెకిలితనానికి అనాగరికపు ఆనవాళ్ళుగా అనిపిస్తాయి.
స్టాఫ్‌రూంలో గురప్ప తప్ప ఎవరూ లేరు. రంగనాథం ఎంతో ఉత్సాహంతో, ఉల్లాసంతో చెప్పిన మాటకు అతను తను బదులీయవలసిన అవసరాన్ని గుర్తించి 'అంటే' అన్నాడు.
'గొర్రె చచ్చింది అంటే తెలియదా?' ఆశ్చర్యం, వ్యంగ్యం కలగలిసిన ప్రశ్న.

'గొర్రె అనే జంతువు చావడం అనే అర్థం తెలుసు. నువ్వు చెబుతున్న విషయం అర్థంకాలా! తిన్నగా చెప్పొచ్చుగా!'
'ప్రపంచం తిన్నగా వుంటే మనమూ తిన్నగా మాట్లాడవచ్చు. ప్రపంచమే తల్లక్రిందులుగా నడుస్తున్నప్పుడు మనం తిన్నగా వుండి ప్రయోజనం ఏమిటి? ఇంతకీ చెప్పొచ్చేదేమంటే రామ్మూర్తిని హెడ్మాస్టర్ చెడ్డ చీవాట్లు పెడుతున్నాడు'
'మరి గొర్రె..' గురప్పకి అర్థం కాలా!
'అబ్బా.. ఇంత వెనుకబడితే ఎలాగయ్యా బాబూ! గొర్రె చావడమంటే అమాయకుడు చేయని నేరానికి బలైపోవడమన్నమాట. గొర్రె కసాయి వాణ్ణి నమ్మి ఉత్తి పుణ్యానికి కత్తికి బలైపోయినట్టు'
ఉదయాన్నే లేచీలేవక ముందే గురప్ప ఇంట్లో వచ్చి వాలాడు పంపాపతి. పంపాపతి గురప్పకి తన పెద్దకొడుకు ద్వారా పరిచయం. ఇంత ఉదయాన్నే 'ఎంతో పని అనుకుంటూ కూర్చోబెట్టి కాఫీ ఇచ్చి అదే మాటను కళ్లతో ప్రశ్నించి సమాధానం కోసం ఎదురుచూస్తున్నాడు.
పంపాపతి కుర్చీలో సర్దుకుంటూ చెప్పాడు.
'చూడు గురప్పన్నా! నువ్వు ఈ స్కీములో కట్టి తీరాల్సిందే!'
'ఏంటా స్కీము? ఏంటా కథా' అని అడక్కుండా తలవూపి గమ్మునున్నాడు గురప్ప.
పంపాపతి షేర్లు, స్కీములు, లాటరీలు, కంతులు, సొమ్ము రెట్టింపులు ఇలాంటివాటిలో కొట్టుమిట్టాడే జీవి అని గురప్పకి తెలుసు.
'ఇదొక కొత్తస్కీము. గొర్రెల పెంపకమన్నమాట. సామాన్యంగా మన ఊళ్ళల్లో గొర్రెలు ఈ ఎండలకు, ఈ తిండికి ఏం పెరుగుతాయి? ఆస్ట్రేలియాలో గొర్రె ఎంతలేదన్నా నూరుకేజీల మాంసం, సుమారుగా ఉన్ని ఇస్తుందట. ఎందుకట్లా? ఆడ పరిస్థితులు వేరు. వాతావరణం వేరు. అక్కడ గొర్రె అంతలాభం ఇస్తావుంటే మన గొర్రె ఏం చెయ్యను? అందుకే మన వాళ్లు అక్కడి టెంపరేచర్, అనుకూలం, తేమ మొత్తం అక్కడి పరిస్థితి అనుకో?- ఇక్కడ కృత్రిమంగా కల్పిస్తారన్నమాట. అంటే ఇండియాలోనే ఆస్ట్రేలియాను సృష్టిస్తారన్నమాట. ఆ పరిస్థితుల్లో పెరిగే గొర్రెలు ఆస్ట్రేలియాలో పెరిగే గొర్రెల మాదిరే ఎక్కువ మాంసం, ఉన్ని ఇస్తాయట.'
గురప్ప వాచీ వంక చూసుకున్నాడు. ఇదేదో ఆసక్తిగానూ వుంది. అవతల టైమై పోతోంది.
'మనకు హెడ్డాఫీసు నెల్లూరులో వుంది. .సి.ఎ.పి అంటే క్యాప్ అంటే టోపీ అనుకోవద్దు. కమ్యూనిటీ అగ్రికల్చరల్ ప్రోడక్ట్ అని పెద్దపెద్దోళ్ళు కలిసి పెట్టేది. నమ్మకమైంది'
గురప్ప 'సరే, ఎంత కట్టాల? ఏమి లాభం?' అడిగాడు.
దార్లోకొస్తున్నాడనుకొని విజృంభించాడు పంపాపతి.
ఎంతో కాదబ్బ, మూడువేలు! మూడవేల రూపాయలు కట్టావంటే నీ పేరుతో ఒక గొర్రెను కొంటారు. ఆస్ట్రేలియానుంచి. ఇంతకుముందు చెప్పినట్టుగా దాన్ని ఒక స్పెషల్ షెడ్లో పెంచుతారు. తిండీగిండీ అంతా సీమదే. అది పెరిగి దండిగ వున్ని రాగానే కత్తిరించి అమ్ముతారు. ఇంక మళ్ళీ అది పిల్లల్ని పెట్టడమూ వాటి ఉన్ని, మాంసం, ఇట్ల గొర్రె పిల్లల్ని పెట్టేకొద్దీ నీ డబ్బు పిల్లల్ని పెట్టినట్టనుకో. మొదటి సంవత్సరం ఆరొందలు, రెండో ఏడు వెయ్యి రూపాయలు, మూడో ఏడు పద్నాలుగు నూర్లు-ఇట్ల పదేండ్లయేపాటికి నీకు దగ్గర్దగ్గర ఎంత లేదన్నా అరవై-అరవై రెండువేలు వస్తాది. లాస్ట్‌లో మళ్ళీ నీ గొర్రె డబ్బు నీకే ఇచ్చేస్తారు-లేదు-ఇంగోటి కొంటానన్నా సరే'
'బాగానే వుంది. కానీ మధ్యలో గొర్రెకేమన్నా అయితే'సందేహపడ్డాడు గురప్ప. ఇంత ఆదాయం అతడూహించలేదు. మూడువేలు ఎంత బ్యాంకులో వేసినా పదేండ్లకు మహా అయితే పన్నెండు వేలు అవుతుందేమో! రెండ్రూపాయలు వడ్డీకిచ్చినా ఆడికి పద్దెడు. ఇంక మూడ్రూపాయల వడ్డీకిచ్చినా అవి వసూలయేదెన్నడు. ఎంత తిప్పలు.
'గొర్రెకు ఇన్సూరెన్స్ చేపిస్తారు. దానికేమన్నా అయితే చివరికి ఎంతొస్తుందో దాంట్లో సగమయినా ఇస్తారు. నీకట్లాంటి అనుమానాలే వద్దు. అందుకే వాళ్ళేం చేసినారో తెలుసునా? చేప్పేదే మర్చిపోయినా, నీ డబ్బు పదేండ్లలో ఎంతైతుందో దానికి ఈ పొద్దే నీకు చెక్కు ఇస్తారు. చాల్నా!' సందేహ నివృత్తి చేసి 'ఏం మరి ఒకటి కడతావా? రెండా?' అడిగాడు.
గురప్ప ఆలోచనలో పడ్డాడు. ఇంతకుముందు కూడా జనమంతా షేర్లు కొనీ కొనీ ఈ పొద్దున నష్టాలేగానీ అసలు కూడా రానోల్లు చాలామందున్నారు.
ఇంకోడెవడో రోజుకి రూపాయి కట్టండి. రెండ్రూపాయలిస్తానని చివరికి మొండిచేయి చూపిచ్చినాడు.
కానీ ఇంట్లోగూడ ఒకమాట అడగాల. బంగారుకొని కమ్మలు చేయించుకోవాలంటుంది. చిన్న టి.వి అమ్మి పెద్దది తేవాల్నని పిల్లలు అడుగుతావున్నారు. ఇంట్లో వుండే నాలుగువేలకు ఇంకో రెండో మూడో తెచ్చి సెకండ్‌హ్యాండుది 'లూనా' ఒకటి కొంటే స్కూలికి బస్సున్నమ్ముకోకుండా టైముకి సరిగాపోవచ్చు.
ఈ మాటలే పంపాపతి ముందు ప్రస్తావించాడు. దానికి పంపాపతి నవ్వుతూ-
'మన ఆలోచనలెప్పుడూ గొర్రెతోక. బెత్తెడు అన్నట్టే వుంటాయన్నా? లేకుంటే ఏంది గురప్పన్నా? రెండేండ్లాగుతే వదినెకు కమ్మలు చేయించొచ్చు. మూడో ఏడుపెద్ద బ్లాకండ్ వైటేమీ ఖర్మ కలర్ టీవీనే ఇంట్లో పెట్టొచ్చు. ఇంక నీ లూనా అంటావా పదేండ్లకు స్కూటరే కొనచ్చు. దానమ్మ సెకండ్ హాండువి కొనేది-రిపేరి-దాండ్లకయ్యే ఖర్చు. ఎందుకొచ్చిన తిప్పలు? డబ్బులు గుడ్లు పెడతాయన్నా-మనం వదలాల్నే గాని'
'కానీ, మూడు వేలంటే ఈ మధ్య జరిగేవి చూస్తావుంటే యేట్లో పోసినట్టేమో అన్పిస్తావుంది' భయం వెళ్ళగక్కాడు గురప్ప
'ఇదట్లాంటి చిన్న చిన్న కంపెనీల మాదిరి కాదన్నా! వాటల్ని దీంతో ఎట్ల పోలుస్తావు? దీనికి మేనేజింగ్ డైరెక్టర్ ఎవరో తెలుసునా?'
'తెలీదు' చెప్పమన్నట్టు చూశాడు గురప్ప.
'సారకాయ వెంకటేశ్వరరావు. ఎవరు మన సినిమాయాక్టర్! ఇంకేమి చాల్నా నమ్మకం!' అన్నాడు పంపాపతి.
గురప్పకి కూడా నమ్మకం కుదరసాగింది. సారకాయ వెంకటేశ్వరరావు వేసిన వేషాలు గుర్తొచ్చాయి. నిజాయితీపరుడైన యజమాని. త్యాగం



చేసే అన్న. మాట కోసం ఆస్తిని, ఐశ్వర్యాన్ని వదిలేసిన పెద్దకొడుకు. శ్రమవిలువ తెలిసిన రైతు. అన్నీ మంచిపాత్రలేసిన ఆయన దీనికి ఎం.డి అనగానే ఎక్కడలేని నమ్మకం వచ్చింది గురప్పకు.
కానీ ఒక పక్క ఇంట్లో అవసరాలు. ఇంకో పక్క పదేండ్లకు వచ్చే ఆదాయాల మధ్య ఊగిసలాడుతున్నాడు.
ఉన్నఫళాన మూడువేలు కట్టేయడమంటే సాహసమే అవుతుంది.
'సగం ధరకే వస్తువులు పట్టకపోండి అని ఆ మధ్యన ఒకడు సంతబజార్‌లో అంగడిపెట్టి చివరికి అందరికీ మొండిచెయ్యి చూపించినాడు చూడు- అట్లాంటిదేమన్నా అయ్యేను మళ్ళా!'
'ఏదయినా ఆలోచించే కట్టు గురప్పన్నా! ఆ విషయమే తీస్కో.. చివరన ఆలోచించి, ఆలోచించి.. అందరినీ చూసి గొర్రెదాటు మాదిరి పోయేది-మోసపోతిమో అని ఏడ్చేది-ఏమి? ముందే పోయి నోళ్ళందరికీ కలర్ టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాలురాలా? ధైర్యం చేయలబ్బా! ధైర్యే సాహసే లక్ష్మి అన్నారు. తెలుగుఅయ్యవారివి నీకు చెప్పాల్నా? ముందు కట్టేవాడికి ఎన్నడూ నష్టం రాదు. అయితే ధైర్యంగా ముందుకురకాల?
అందరికంటే ముందుకడితే ఏదో స్పెషల్ ప్రైజ్ కూడా ఇస్తారట... అంతేలే.
ధైర్యం, తెలివి వున్నాడికి ఆ మాత్రం గుర్తింపు వద్దా?
గురప్పకి ఇందులో కట్టకుండా వుండడానికి అభ్యంతరాలు ఏవీ కన్పించలేదు.
'సర్లే! పంపాపతి! అట్లయితే నేను కూడాచేరతా! కానీ ఒక మాట ఇంట్లో వాళ్ళకు కూడా చెప్పి ఈవారంలోపల కడతాను అమౌంటు'
పంపాపతి ఆనందంగా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.
గురప్ప ఆ తరువాత ఏమాత్రం తీరిక దొరికినా గొర్రెల గురించి ఆలోచించడం మొదలు పెట్టాడు.
తను ముందు కట్టేస్తే, అందరూ తనను చూసి క్యూలో నిలుచుని కడతారు.
తను సార్జంట్-అందరూసైనికులు.
తనో అడ్వైజరు. చూస్తాం! అసలన్నా రాకుండా బోతుందా?
ధైర్యం చేసినా! డబ్బులు రావాల న్యాయంగా అయితే!
కష్టపడిన సొమ్ము యాడికి పోతుంది?
ఇంట్లో భార్యని ఒప్పించాడు. పిల్లలను సముదాయించాడు. తను సమాధానపడ్డాడు.



ఎవరికీ (స్టాఫుకు) చెప్పకుండా రెండ్రోజుల తర్వాత మూడువేల రూపాయలకు డి.డి కట్టి పంపాపతికి ఇచ్చాడు
ఒక వారానికి అక్నాలెడ్జిమెంట్, పదేండ్లకు పోస్టుడేటెడ్ చెక్కు, అగ్రిమెంట్ కాగితాలు, గొర్రె కొన్నందుకు అభినందనపత్రం, కృతజ్ఞతాలేఖ అన్నీ ఒకేసారి వచ్చి ఆనందంలో ముంచెత్తాయి.
కొన్నాళ్ళకి ఆనోటా, ఈనోటా అందరికీ తెలిసింది గురప్ప గొర్రెల స్కీములో చేరాడని.
ఒక్కోసారి గురప్పే ఫనికట్టుగొని చెప్పిన సందర్భాలు లేకపోలేదు. తను ఒక్కడే మందనుండి వేరుపడ్డ గొర్రెలా వుండడందేనికని. బలవంతపెట్టి పంపాపతిని తనలో ఆవహింపజేసుకుని లెక్కల మాస్టరుతో కూడా ఒక గొర్రెకొనిపించాడు.
ఈ గొర్రె కొన్నప్పటినుంచి గురప్పకు బంగారు బాతులంటే యివేనేమో అనిపించింది.
ఎవరన్నాతీరికగా దొరికితే ఈ స్కీమ్ గురించి చెప్పకొచ్చాడు అందులో చేరి తనెంత ప్రయోజకుడయ్యిందీ వివరించాడు.
కొందరతన్ని 'గొర్రెప్ప' అని కూడా చాటుగా ఎగతాళిగా పిలుచుకున్నారు. అయితే గురప్ప లెక్కచేయలేదు.
'తనకు ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ వచ్చిన రోజున ఈనోర్లు మూతపడవా?' అనుకున్నాడు.
మరికొందరు వేళాకోళంగా-
'ఏం సార్ క్షేమమా!' అంటారు. 'ఆ! ఏదో ఇట్లా' అనేవాడు గురప్ప.
'మీరు సరే సార్! మేమడిగింది మీ గొర్రె గురించి. క్షేమంగా వుందా?' అంటారు. తను ఆలోచించుకుని సమాధానం చెప్పేలోపల నవ్వుకుంటూ వెళ్ళిపోతారు. అయితే గురప్ప బాధపడలేదు.
'తన గొర్రె కడుపు పండిన రోజునే వీడి నాపచేను పండుతుందిలే' అనుకున్నాడు.

ఒకరోజు సైన్స్ టీచరు ఒక మొద్దుపిల్లాడ్ని 'గొర్రె' అని తిట్టడం గురప్పకు బాధనిపించింది.
వీడొక అప్రయోజకుడు. చదువురానివాడు. తెలివిలేని వాడు. తన చదువుకు, తిండికి, తల్లిదండ్రులకు భారమైన వాడు వీడికి, గొర్రెకు పోలికా?
గొర్రె పాలిస్తుంది. ఉన్నినిస్తుంది. మాంసమిస్తుంది.
కట్టిన ముష్టి మూడువేలరూపాయలకు పదేళ్ళలో అరవై వేలిస్తుంది. ఇంతటి ప్రయోజనాలిచ్చే గొర్రెకు, ఈ శుంఠకు హస్తిమశకాంతరం కదా! అయినా పోల్చే వ్యక్తికి బుర్రొండద్దు? అనుకుని తృప్తి పడ్డాడు.
ఇంకోరోజు గుమస్తా ఒకడు విద్యార్థుల గుంపును పట్టుకుని 'గొర్రెల మందలా అట్లా ఒకేసారి రాకుంటే ఒకరొకరే రాకుండదా!' అన్నాడు.
గురప్పకి చెప్పాలనిపించింది.
'గొర్రెలమంద అన్నది ఐకమత్యానికి, సంఘీభావానికి గుర్తని, మనమంతా ఒకరిలో, ఒకరం కలహించుకుని యిలా విడిపోయినందుకే ముస్లింలు, ఆంగ్లేయులు దండయాత్రలు చేసి మనలను పాలించారని, మందలోని యూనిటీని మనమంతా అలవరుచుకోవాలని'
మరో రోజు డ్రాయింగ్‌సారొచ్చి గురప్పముందు తనగోడు వెళ్ళబోసుకున్నాడు. 'తన దూరబ్బంధువు ఒకాయన డబ్బుఅవసరమంటే యిచ్చానని, ఇప్పుడు నాకర్జంటుగా కావాల్సి వచ్చిందన్నా! అంటూ వెళ్ళి అడిగితే 'నీ డబ్బేమన్నా పీక్కు తింటానా? యిస్తానన్నాను కదా!' అంటూ ఛీత్కారింపుగా మాట్లాడాడని అవసరానికి ఆదుకుంటే మనుషులంతా అన్యాయం చేస్తారా? అని. అసలు తనకు మనుషులంటేనే నమ్మకం పోతోందని.'
అన్నీ విన్నాక గురప్ప తాపీగా చెప్పాడు.
'అందుకే సార్. నేన్చెప్పేది-మనుషుల కంటె గొర్రెల్ని నమ్మేది మేలు' అని. దాంతో డ్రాయింగ్‌సార్ గురప్పవైపు చికాకుగా చూసి చటుక్కున లేచి ఎందుకెళ్ళిపోయాడో గురప్పకు అర్థం కాలేదు.
'జనాలు మంచి చెబితే యింతేలే' అనుకున్నాడు.
బళ్ళు మూశారు, తెరిచారు.
ఆరోజు గురప్పకు కనుక అలవాటుంటే డైరీలో 'నాజీవితంలో మర్చిపోలేనిరోజు' అని వ్రాసి వుండేవాడేమో!
మహారాజయితే కనుక సువర్ణాక్షరాలతో లిఖింపజేయించి వుండేవాడేమో! గురప్పకు మొదటివంతుగా ఆరొందల రూపాయల చెక్కు వచ్చింది.
'గొర్రె పెట్టిన మొదటి గుడ్డు' అనుకుని 'ఛఛ.. మొదటి పిల్ల' అని దిద్దుకున్నాడు.
చాలామంది అభినందనలు తెలిపారు.
కొందరు అనవసరంగా కామెంట్‌చేశామని బాధపడినట్టు కనిపించి పార్టీ అడిగారు.చిన్న టీపార్టీ ఇచ్చాడు గురప్ప. ఫర్‌దిహెల్త్ ఆఫ్ ది గోల్డెన్ షీప్. అంతకుముందు ఏమూలో వున్న చిన్న అనుమానపుకోశం కూడా ఈ సంఘటనతో తుడుచుకు పోయింది గురప్పకు.

మిగతా 13వ పేజీలో



# మనసు వైద్యం

ప్రశ్న: ఈ మధ్యే ఒక స్వామిజీ జలప్రళయం వల్ల ఈ ప్రపంచ మంతా నాశనమైపోతుందని చెప్పడం విన్నాను. అప్పటి నుంచి నాకు చావు అంటే భయం పట్టుకుంది. ఎంత ప్రయత్నించినా ఈ భయం పోవడం లేదు. ఈ భయం వల్ల ఏ పని పై కూడా ఇంట్రస్టు కలగడంలేదు. చాలా డల్‌గా, డిప్రెసడ్‌గా ఉంది. ఇక నా జీవితం ఇంతేనా?

– ఎ.విజయ్,హైదరాబాద్

జవాబు: మీరొక రకమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నారంటే మీరు ఆశ్చ ర్యపోతారేమో! ఎన్నో సంవత్సరాల నుండి చాలామంది, ఈ ప్రపంచం అంతమైపో తుందని చెప్తూనే ఉన్నారుగా! మరి ఏం కాలేదే? అందుకని మీరు అనవసరంగా ఆలోచించకుండా, ప్రతి విషయాన్ని భూత ద్దాలతో చూడకుండా, మీ అనవసరమైన భయంతో బ్రతుకుని నాశనం చేసుకో కండి. మీకు హిప్నోథెరపీ అద్భుతంగా పనిచేస్తుంది.

ప్రశ్న: నాకు నిద్రలో మాట్లాడే గుణం ఉంది. ప్రతిరోజూ రాత్రి భయం భయంగా ఏం మాట్లాడే స్తానేమోనని అనుకుంటూ నిద్రపో తున్నాను. నిద్రలో కొన్ని నిజాలు మాట్లాడేస్తే నా కొంప పూర్తిగా మునుగుతుంది. ఈ సమస్య నుండి నన్ను బయటపడేలా చేయండి.

– ఆర్.సుచరిత,మహబూబ్‌నగర్

జవాబు: మీది నిద్రకు సంబంధించిన సమస్య. మీరన్నది నిజమే! మీరు నిద్రలో ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడడం వల్ల మీకు చాలా ఇబ్బంది కలుగవచ్చు. కానీ, మీరు ఏమాత్రం చింతించాల్సిన అవసరంలేదు. మీరు మీ దగ్గరలోనే ఉన్న సైకియాట్రిస్టుని కలువగలిగితే, ఆయన ఇచ్చే మందుల వల్ల మీ మానసిక సమస్య పూర్తిగా తగ్గిపో తుంది. ఒకవేళ తగ్గకపోతే, హిప్నాసిస్ ద్వారా మీ సమస్యను పరిష్కరించవచ్చు.

ప్రశ్న: డాక్టర్ గారూ, నేను పి.జి చేస్తున్నాను. చిన్నప్పటి నుంచి నేను బాగానే చదివేదాన్ని. కానీ, ఈ మధ్యే ఎందుకో పూర్తిగా మారిపోయాను. ప్రతి చిన్న విషయానికి ఎక్కువగా కంగారుగా ఉంది. ఏదో తెలియని భయం. గుండెదడ. అసలు పరీక్ష సరిగ్గా వ్రాయగలనా అనే భయం నిత్యం వెంటాడుతోంది. దీనివల్ల నా వ్రాతలో కూడా మార్పు కనప డుతోంది. నాకు తండ్రిలేడు. తల్లే కష్టపడి చదివిస్తోంది. నేను నా తల్లిని సంతోషపెట్టాలి. లేకపోతే నాకు చావే శరణ్యం. నా తల్లిని



సంతోష పెట్టాలంటే ఇప్పుడు నేనేం చేయాలి?

– ఎం.ఆదిలక్ష్మి,విశాఖపట్టణం

జవాబు: ముందుగా 'చావు' గురించి ఆలోచించడం మానేయాలి. మీకొక చాలా చిన్న మానసిక సమస్య మాత్రమే ఉందని చెబితే మీరు నమ్మగలరా? ఈ మానసిక సమస్యనే "యాంగ్జైటీ న్యూరోసిస్" అని అంటారు. మీరు విశాఖపట్టణంలోనే ఉన్న మంచి సైకియాట్రిస్టును వెంటనే కలవండి ఇంత చిన్న సమస్య కోసం మీరు చావు గురించి ఆలోచించి, మీ పైనే అన్ని ఆశలు పెట్టుకున్న మీ అమ్మకు కడుపుకోత విధిం చకండి. మీ సమస్యకు నూరు శాతం పరిష్కారం ఉంది. ఇంత చిన్న సమస్యకి మీరు ఇంత అతిగా స్పందించడం ఏమాత్రం బాగాలేదు.

ప్రశ్న: పిల్లల్ని అతిగా ఎందుకు కొడ తారు? మా ఇంటి ఎదురుగా ఉన్న ఇంట్లో ఆయన ఇద్దరు చిన్న పిల్లల్ని ఎంత అతిగా కొడతాడంటే, మాకే చాలా బాధగా ఉంటుంది. వాళ్ళని రక్తం వచ్చేలా కొడతాడు. ఒకసారి మేము భరించలేక, వాళ్ళని అలా కొట్టవద్దు అంటే "నా పిల్లలు, నా ఇష్టం. అయినా, వాళ్ళని కొట్టకపోతే వాళ్ళు జీవితంలో పైకిరారు" అని అన్నాడు. ఇటువంటి వాళ్ళని ఎలా మార్చాలి?

– ఎ.వి.సుందరరావు,కర్నూలు

జవాబు: పిల్లల్ని అతిగా కొట్టడం కూడా ఒక మానసిక జబ్బేనని చాలామందికి తెలి యదు. పేరెంట్స్ పిల్లల్ని అతిగా హింసిం చడాన్ని "బేటర్డ్ బేబి సిండ్రోమ్" అని అంటారు. మీ యింటి ఎదురింటాయన చిన్నతనంలో చాలా కష్టాలు అనుభవించి ఉండవచ్చు. ఆయన తల్లిదండ్రులు కూడా ఆయన్ని అలాగే బాధపెట్టి ఉండవచ్చు. అసలు ఆయనకి చిన్నతనంలో ప్రేమ చాలా కరువై ఉండవచ్చు. అందుకే ఆయన అలా బిహేవ్ చేస్తుండవచ్చు. కానీ, ఆయనకు తెలియనిదేమిటంటే ఆ పిల్లలు కూడా అలాగే తయారవుతారని. ఆ పిల్లల్లో శాడిజం బాగా పెరగడానికి అవకాశం ఉంది. ఇలాంటి తల్లిదండ్రుల్ని సైకోథెరపీ ద్వారా పూర్తిగా మార్చవచ్చు.

ప్రశ్న: జీవితంలో 'సక్సెస్' వైపు వెళ్ళాలంటే ఏం చేయాలి?

– ఎ.జార్జ్, నిజామాబాద్

జవాబు: నేను సాధించడానికి ప్రయ

?!


త్నిస్తాను అని అనుకోవడం కన్నా నేను తప్పకుండా సాధించగలను అని అను కోవడం ద్వారా చాలా త్వరగా సక్సెస్ వైపు వెళ్ళొచ్చు. జ్ఞానానికి అంతులేదు కాబట్టి ఎంత సంపాదిస్తే అంత మంచిది. గొర్రెదాటులా కాకుండా, అంచెలంచెలుగా విజయంవైపు వెళ్ళడం మంచిది. కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండడం వల్ల, మీకు మానసిక ప్రశాంతత పెరుగుతుంది. ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించడం ఇంకా మంచిది. అన్నింటికన్నా ముఖ్యం మీపైన మీకు నమ్మకం. దీనివల్ల విజయం మీదే!

**–డా. వి. నగేష్**
హిప్నటిస్ట్

మీ ప్రశ్నలు పంపాల్సినచిరునామా

మనసువైద్యం
ఆదివారం ఆంధ్రజ్యోతి, రోడ్ నెం: 8,
బంజారాహిల్స్, హైదరాబాద్-500 034


## ఇలా చేస్తే సరి!



* జుత్తు బాగా ఊడిపోయే చోట మందా రాకులతో రుద్దాలి. మంచి ఫలితం కనిపిస్తుంది.



* ఆకుపత్రి చూర్ణం నోటిలో వేసుకుని చప్పరిస్తే క్రమంగా నత్తి హరిస్తుంది.



* హారతి కర్పూరం, తులసి ఆకుల రసం బాగా రంగరించి లేపనం చేస్తే శోభి మచ్చలు త్వరగా తగ్గిపోతాయి.



* వారానికి ఒకసారి గ్లిసరిన్, నిమ్మరసాల మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవడం వలన ముఖం అందంగా కనిపిస్తుంది.




* నిమ్మరసంలో కొద్దిగా తేనె కలిపి రాసుకుంటే నల్లమచ్చలు పోతాయి.

– ఎన్.శివానంద్

## గర్భం రానిరోజులు తెలిపే సాధనం

యూనిపాత్ పర్సనల్ సిస్టమ్ ఆఫ్ కాంట్రసెప్షన్ అనే సాధనం ఇటీవల మార్కెట్‌లోకి వచ్చింది. యీ సాధనం సెక్స్ జరిపినా గర్భం వచ్చే అవకాశాలు లేని రోజులను స్త్రీలకు కచ్చితంగా పరీక్షించి చెబుతుంది. మూత్రంలోని హార్మోన్లను పరీక్షించడం ద్వారా పనిచేస్తుందిది. దీని వల్ల సేఫ్ పీరియడ్-అన్ సేఫ్ పీరియడ్ అంటూ లెక్కలేసుకోవాల్సిన పని తప్పింది. గర్భనిరోధం కోసం పురుషులు కండోమ్స్, స్త్రీలు పిల్స్ వాడాల్సిన బాధ తప్పుతుంది.



మూత్రాన్ని చెక్ చేశాక 'గర్భం వచ్చే అవకాశం వుంది' అని యీసాధనం సిగ్నల్‌యిచ్చినప్పుడు మాత్రం జాగ్రత్త తీసుకుంటే చాలు. దీని వెల 75 డాలర్లు. సుమారుగా మూడు వేల రూపాయలు. వాడటం కూడా సులభమే.

## ఆరోగ్యంలో మనది 26వ స్థానం

హెల్త్‌కేర్-ఇంటర్నేషనల్ అనే పత్రిక ఇటీవల ప్రపంచవ్యాప్తంగా సర్వే జరిపి యిరవై ఏడు దేశాల ఆరోగ్య స్థితిగతులను తెలియజేసింది. ఏదేశం ప్రజలు ఎంత మాత్రం ఆరోగ్యంగా వున్నారో విపులం



గా పరిశీలించిందిది. యీ సర్వే ప్రకారం ఇజ్రాయిల్, స్వీడన్ వాసులే అందరికంటే ఆరోగ్యంగా నవనవలాడుతూ వుంటారట. జలుబూ జ్వరాలతో ముక్కుతూ మూల్గుతూ వుండే వారి సంఖ్య వీళ్లలో తక్కువట. యిక మనం 26వ స్థానంలో వున్నాం. చిట్టచివరి స్థానం సౌత్ ఆఫ్రికాది. దాని నెంబర్ 27. అంటే మనం వెనుక నుంచి రెండవ స్థానంలో వున్నామన్న మాట.

## తల్లులూ! వద్దు!



ఇటీవల 'ప్రెగ్నెన్సీ-చైల్డ్‌హుడ్' అనే అంశం మీద జరిగిన సర్వే పొగతాగే గర్భవతుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గర్భం దాల్చిన 18 నుంచి 20వారాల తర్వాత తల్లులు పొగతాగితే పుట్టబోయే పిల్లలకు శ్వాసకు సంబంధించిన యిబ్బందులు వచ్చే అవకాశం నలభైశాతం వరకు వుందని యీ సర్వే తెలిపింది. బిడ్డ పుట్టాక కూడా తండ్రి/ తల్లీ, బంధువులు బిడ్డ సమీపంలో సిగరెట్లు వూదుకుంటూ తిరిగితే బిడ్డకు శ్వాస కష్టమవుతుందని ఆ సర్వే తెలిపింది. అంతే కాకుండా పిల్లలకు దగ్గువచ్చే అవకాశం కూడా వుందట.

## గొర్రె చచ్చింది కథ:12వ పేజీ తరువాయి

కథ:12వ పేజీ తరువాయి

మంచి సంస్థ. నిజాయితీ ·ఎం.డి ఆరోగ్యకరమైన వాతావరణం. జోరుగా బిజినెస్' ఎలా మోసంచేస్తుంది? అజ్ఞానానికి జాలి పడ్డాడు. ఈసారి సెలవుల్లో ఓసారి నెల్లూరు వెళ్ళి ప్లాంటు అదీ చూసి రావాలనుకున్నాడు. అది ప్రైమరీ రెస్పాన్సిబిలిటీ ఆఫ్ ఏ సిన్సియర్‌మెంబర్ అని అనుకున్నాడు.

అమాటే లెక్కల మాస్టారితో చెప్పి ప్లానుకూడా వేసుకున్నాడు.

ఈ సంవత్సరం డబ్బు, అలా ఇలా ఖర్చయిపోయింది. వచ్చేసంవత్స రంలో వచ్చింది వచ్చినట్టుగా ఫిక్స్‌డ్‌లో వేసి పారేయ్యాలనుకున్నాడు.

కానీ

ఒకరోజు హడావిడిగా ఒకచేత్తో క్యారియర్, వాటర్‌బాటిల్‌గల బుట్ట ఇంకో చేత్తో పుస్తకాలు, యూనిట్ పరీక్షల పేపర్లు పట్టుకుని స్టాఫ్‌రూంలోకి దూసుకు వచ్చిన గురప్పని అక్కడ కూర్చుని వున్న హిందీమాస్టారితో సహా నలుగురైదుగురు ఎగాదిగా చూసి–

'సార్ ఈరోజు పేపర్ చూశారా?' అన్నారు యిద్దరు ముగ్గురుఒకేసారి.

'ఎక్కడసార్? పొద్దున లేచినప్పట్నుంచి ఉరుకులు పరుగులు అయితే గాని ఈ టైముకు రాలేను. చూళ్ళేదు. ఏం, ఏమన్నా విశేషమా?'

'ఆ! విశేషమే!' విరిచి వ్యంగ్యంగా చెప్పాడు హిందీసారు.

'ఏంసార్ అదీ! మాగ్గూడా చెప్పొచ్చుకదా' అంటే సీట్లోకి వెళ్ళి బుట్ట, పేపర్లు, పుస్తకాలు పడేసి వీళ్ళ దగ్గరకొచ్చాడు.

'అదే మీ కమ్యూనిటీ అగ్రికల్చరల్ ప్రొడక్ట్స్ దివాలా తీసిందంట.





కన్నమర్లకు సిఎపి టోపీ అనే హెడ్డింగు మొదటిపేజీలో యిదుగో క్రిందుంది చదవండి' గురప్పకు సన్నగా వణుకువచ్చింది. కంపిస్తున్న చేతులతో పేపర్ తీసుకున్నాడు.

సిఎపి ఎత్తిపోయింది. చైర్మన్ ఐపి పెట్టాడు.

ఎం.డి సొరకాయ వెంకటేశ్వరరావు తను కేవలం ఎంప్లాయిమాత్ర మేనని యిందులో తనకెలాంటి పాత్ర లేదని స్టేట్‌మెంటిచ్చాడు.

గురప్ప మొహంలోకాంతులు క్షీణించాయి. కళ్ళు చికిలించి మొహంలో భావాలు దాయాలనుకున్నాడు.

బాధ,నమ్మకద్రోహం, అమాయకులతో ఆట. అనుకోకుండా అతనికి పంపాపతి చెప్పిన హామీలు గుర్తొచ్చాయి. మళ్ళీ కొంచెం కళ మొహం లోకి రాబోయింది. ఈలోగా మనసులో మాట గ్రహించనట్టు డ్రాయింగ్‌సార్

'మావాడొకడు కట్టాడంట. చెక్కుందిలే అని సంబరపడుతున్నాడు. పిచ్చినాయాల? ఐ.పి పెట్నాక యింక చెక్కేమిటికిరా? అన్చెప్పినా' అనడంతో ఆ రాబోయే కళ యింకొంచెం నలుపు మాసిపోయింది. ఎంత నమ్మించారు?

అసలు గొర్రె కొనలేదని. వసూలు చేసిన డబ్బునే బ్యాంకుల్లో డిపాజిట్ చేసి తలా ఆరొందలు ఇచ్చారని పేపర్ చెబుతోంది. తను ఏమొగంతో వీళ్ళముందు తిరగాలి?

ఇంట్లో ఎలా మొహం చూపించగలగాలి?

కమ్మలు, పెద్దటీవి, లూనా, పంపాపతి, గొర్రెపిల్ల, మూడువేల డిడి,ఆరొందల డిడి అన్నీ కళ్ళముందు మెదిలాయి.

తన మాటలు విని. లెక్కల మాస్టారు మోసపోయినందుకు బాధని పించింది.

ఆయనకు విషయం తెలుసో, లేదో!

తన బాధని, జరిగిన మోసాన్ని చెప్పి బాధను పంచుకుందామని లెక్కలమాస్టార్ దగ్గరకు బయలుదేరాడు గురప్ప.

స్టాఫ్ వాకిలి దాటుతుండగా వెనుకనుండి హిందీసారూ 'గొర్రె చచ్చింది' అని వ్యంగ్యంగా, కసిగా అనడం గురప్పకు వినిపించింది.

**వచ్చేవారం కథ**
**అప్రతిహతం**
**– కపిల**